



పోలీస్ స్టేషన్‌లో సోహెల్‌ను విచారిస్తుండగా బయట కాపలా ఉన్న పోలీసులు

వలస కార్మికుల బతుకులు దుర్భరం

అమలుకు నోచని వలస కార్మిక చట్టం
కనీస సౌకర్యాలు కరువు
చాలీచాలని వేతనం
పట్టించుకోని కార్మిక శాఖ



వలస కార్మికుల నివాస ప్రాంతాలు

ఉన్నచోట ఉపాధి లేక పొట్టకూటి కోసం కడుపు చేత పట్టుకుని పనులకోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక శాఖ వారిని మరింత కష్టాల్లోకి నెట్టింది. రెక్కడితే గాని డొక్కాడని కార్మికులను కన్నీళ్ల పాలు చేస్తోంది. వలస కార్మికుల కోసం ఉన్నా వలస కార్మిక చట్టాన్ని (మైగ్రేషన్ యాక్టు) కార్మిక శాఖ యాజమాన్యాలకు తాకట్టు పెట్టింది. దీంతో హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామికవాడలలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ప్రజాశక్తి హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామికవాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రాంతంలో సండ్లపల్లి, తూముకుంట, గోళపురం, కొట్నూరు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 150 కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ఫార్మా, స్టీల్ పరిశ్రమల్లో ఎక్కువ శాతం ఒరిస్సా, కలకత్తా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస కార్మికులు పొట్టకూటి కోసం ఈ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం కార్మిక శాఖ అధికారులు వలస కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలన్నింటినీ సేకరించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో వలస కార్మిక చట్టం అమలు జరగడం లేదన్నది అక్షర సత్యం. వలస కార్మికులు ఎంతమంది ఏ పరిశ్రమలో పని చేస్తున్నారు, వాళ్ళు ఎక్కడ నివాసముంటున్నారు, వారికి వేతనం ఎంత ఇస్తున్నారు వివరాలు సైతం కార్మిక శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. కార్మిక గుత్తేదారు నుంచి కార్మికులను దిగుమతి చేసుకొని ఆ కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు సైతం కల్పించకుండా ఒకే గదిలో 5 నుంచి 10 మందిని ఉంచి వారి శ్రమను గుత్తేదారులు, పారిశ్రామిక వేత్తలు దోచుకుంటున్నారు. నిబంధనల మేరకు ఎనిమిది గంటల పని విధానం ఉంటే ఇక్కడ 12 గంటలు పనిచేస్తున్నారు. వీరికి వేతనాలు కూడా అంతంతమాత్రమే. విధులు నిర్వహిస్తే వేతనం లేదంటే లేదు. ఒక్క రోజు విధులకు హాజరు కాక పోయిన ఆ రోజు వేతనంలో కోత విధిస్తారు. కనీసం వీరు నివాసం ఉండడానికి అయినా మంచి గదులు కేటాయిస్తారా అంటే అదీ లేదు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కేటాయించిన చిన్న గదుల్లో పదుల సంఖ్యలో వలస కార్మికులు బిక్కుబిక్కుమంటూ జీవనం చేయాల్సిన పరిస్థితి ఉంది. కనీసం స్నానం చేయడానికి స్నానపు గదులు సైతం లేవు. అరుబయట స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరి కొన్ని పరిశ్రమల వారు పరిశ్రమల లోపలే గదులను ఏర్పాటు చేసి వారిని ఖైదీల కన్నా హీనంగా చూస్తున్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు ఇంత దుర్భరంగా జీవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ మాత్రం నిద్ర మత్తులో నుంచి బయటకు రావడం లేదు. జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ ఉన్న హిందూపురంలో జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉన్నప్పటికి జిల్లా అధికారి జిల్లా కేంద్రానికే పరిమితం అయ్యారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎప్పటికప్పుడు పరిశ్రమలపై తనఖీలు నిర్వహించి, వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి. వలస కార్మికుల వివరాలను సేకరించి, వారికి కార్మిక చట్టం ప్రకారం అందాల్సిన సౌకర్యాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యతకార్మిక శాఖ అధికారులపై ఉంది. అయితే కార్మిక శాఖ అధికారులు ఎవరు ఇటువైపు చూడకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయి. వీరు పడుతున్న బాధలను ఎవరికి చెప్పాలో తెలియక, బయటకు చెబితే యాజమాన్యాలు ఉద్యోగంలో నుంచి తీసి వేస్తాయన్న భయంతో కనీస సౌకర్యాలు లేక పోయినా అక్కడే జీవనం చేస్తున్నారు.

వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి



తూముకుంట, గోళపురం పారిశ్రామికవాడలో కార్మిక శాఖ వెంటనే వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, కార్మికుల వివరాలను సేకరించాలి. వలస కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో వలస కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

ఇఎస్ వెంకటేష్
సిఐటియు జిల్లా కార్యదర్శి

నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి



తూమకుంట, గోళపురం పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్, ఫార్మా, వీర్గో పరిశ్రమలో పని చేస్తున్న వలస కార్మికుల నివాస ప్రాంతాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వారి నివాస స్థలాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. ప్రతి నెల ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి.

రవికుమార్,
టిలా అధ్యక్షులు



వలస కార్మికులు నివాసం ఉండే ప్రాంతం



తమ ఇబ్బందులు వివరిస్తున్న వలస కార్మికులు

రాయదుర్గంలో జాతీయ దర్యాప్తు సంస్థ సోదాలు

యువకుడిని అదుపులో తీసుకున్న ఎన్ఐఎ అధికారులు

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని ఓ ఇంటిలో జాతీయ దర్యాప్తు సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ఎన్ఐఎ అధికారులు మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు, సోదాలు నిర్వహించారు. పట్టణంలోని తహశీల్దార్ రోడ్ వేణుగోపాలస్వామి గుడి వీధిలో గల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా ఇంట్లో ఎన్ఐఎ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. అబ్దుల్లా పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోహెల్ (33 సంవత్సరాలు) ను అదుపులో తీసుకొని విచారణ జరిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి అక్కడ విచారణ జరిపారు. అనంతరం ఆ యువకుడిని ఎన్ఐఎ అధికారులు బెంగళూరుకు తీసుకు వెళ్లినట్టు సమాచారం. ఎన్ఐఉ సోదాలు తనిఖీ విచారణ సందర్భంగా పోలీసులు అబ్దుల్లా ఇంటి సమీపంలోనూ, పోలీస్ స్టేషన్ వద్దకు ఎవరినీ రానివ్వలేదు. ఎటువంటి సమాచారం మీడియాకు వెల్లడించలేదు. సోహెల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రం హోం కారణంగా కొంతకాలంగా ఇంట్లోనే విధులు నిర్వహిస్తున్నారు. సోహెల్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే సమాచారంతో ఎన్ఐఎ అధికారులు రాయదుర్గంలో తనిఖీలు చేశారు. యువకుడి ఫోన్‌కాల్ రికార్డు, డేటాను పరిశీలించినట్లు సమాచారం. అంతేకాక సోహెల్‌కు సంబంధించిన రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 28న సోహెల్‌కు పెళ్లి కాగా 29న అతని తండ్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చెందారు. సోహెల్ బెంగళూరులో ఉన్నప్పుడు ఉగ్రవాదులు అతని ఫోన్‌ను ఉపయోగించినట్లు సమాచారం. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ లో మార్చి మొదటి తేదీన భారీ ప్రేలుడు సంభవించింది. ఈ సంఘటనపై విచారణను ఎన్ఐఎ తన చేతుల్లో తీసుకోగా ప్రధాన నిందితులను పశ్చిమ బెంగాల్లో అరెస్టు చేశారు. ప్రధాన నిందితుల విచారణలో సేకరించిన వివరాల ఆధారంగా ఎన్ఐఎ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ప్రేలుళ్ల ఘటనతో రాయదుర్గానికి చెందిన సోహెల్‌కు సంబంధం ఉందనే అనుమానంతో ఎన్ఐఎ అధికారులు విచారణ చేపట్టారు. బెంగళూరు, తమిళనాడులోని కోయంబత్తూర్ సహా దేశంలో 11 వేరువేరు ప్రాంతాల్లో ఎన్ఐఎ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కోయంబత్తూర్‌లో నహీం, జాఫర్ ఇక్బాల్‌ను, ఇద్దరు వైద్యులను అరెస్టు చేశారు. రాయదుర్గంలో సోహెల్‌ను అదుపులో తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు గంటలసేపు విచారణ అనంతరం బెంగళూరుకు తరలించారు. రాయదుర్గంలో ఎన్ఐఎ అధికారుల దర్యాప్తు సంఘటన సంచలనం సృష్టించింది. దేశంలో ప్రధాన ఉగ్రవాద కార్యకలాపాలకు రాయదుర్గంలో కూడా సంబంధాలు ఉన్నాయన్న విషయం స్థానికులను ఉలికిపాటుకు గురి చేసింది

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానన్న మనస్థాపంతో .....

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్



గౌతమ్ (ఫైల్‌ఫొటో)

బీటెక్ పరీక్షలలో ఫెయిల్ అయినందుకు మనస్థాపం చెంది విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండలంలో చోటుచేసుకుంది. విద్యార్థి బంధువులు తెలిపిన మేరకు వివరాలు... మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన ఆనంద్ కుమారుడు గౌతమ్ (22) అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. చివరి సంవత్సరం పరీక్షలలో ఏడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. సప్లమెంటరీ పరీక్షలు రాసినప్పటికీ పాస్ కాకపోవడంతో మనస్తాపం చెందిన గౌతమ్ మంగళవారం తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇద్దరు ఆడపిల్లల నడుమ పుట్టిన కొడుకు మృతి చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర నిఘా

కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

ఇవిఎం, వివిప్యాట్ లు భద్రపరచిన బిట్ కళాశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి తగిన సూచనలు సలహాలు జారీచేశారు. ఈ సందర్భంగా సంబంధిత లాగ్ బుక్ లో కలెక్టర్, ఎస్పీ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జిల్లాకు చెందిన 6 అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివిప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరిగిందన్నారు. బిట్ కళాశాలలో మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఈవిఎం, వివిప్యాట్ లు భద్రపరచడం జరిగిందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం నిమోజక వర్గాలతో పాటు పార్లమెంట్ స్థానానికి సంబందించిన ఇవిఎం, వివిప్యాట్ లు భద్రపరచడం జరిగిందన్నారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు కొన్ని ప్రాంతాలలో జరిగిన సంఘటనల నేపథ్యం లో మూడంచల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలలో ఎంట్రన్స్, రోడ్ పాయింట్ వద్ద నుంచి సరైన ధ్రువపత్రాలు ఉంటేనే పంపుతున్నారని వివరించారు. బలగాలతో బందోబస్తు, 80 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సందేహాలుంటే జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీలను సంప్రదించి వివరణ తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుంచి ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అదే విధంగా జిల్లా ఎస్పి మాధవరెడ్డి స్ట్రాంగ్ రూముల వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ లో వద్ద విధులు నిర్వహిస్తున్న వారందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి నియోజకవర్గం ఆర్ఓ భాగ్య రేఖ, ధర్మవరం నియోజకవర్గ ఆర్ఓ వెంకట శివ సాయి రెడ్డి, మడకశిర నియోజకవర్గ ఎన్నికల అధికారి గౌరీ శంకర్, ఆయా నియోజకవర్గాల ఎన్నికల సహాయ అధికారులు, డీఎస్పీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో వసతులపై సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం, రూరల్ మండల పరిధిలో ఉన్న పెన్నా నదిలో గత కొంత కాలంగా అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో కొంత మంది ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ పేరుతో బిల్లులు సృష్టించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి దినపత్రికలో రెండు రోజుల క్రితం కథనం వెలువడింది. దీనిపై స్పందించాల్సిన అధికారులు అధికార పార్టీ నేతల అండదండలతో వారిపై చర్యలు తీసుకోలేదు. దీంతో మంగళవారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పెన్నా నదిలో ఇసుక తరలింపును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవి కుమార్, సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు వద్ద ఉన్నా పెన్నా నదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తూ కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము దండుకొంటు, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారన్నారు. పగలు రాత్రి అని తేడా లేకుండా నకిలీ బిల్లులతో కర్నాటకకు రవాణా చేస్తున్నారని విమర్శించారు. అధికారులకు సమచారం ఇచ్చిన ఎవరు స్పందించడం లేదన్నారు. ఇప్పటికే చుట్టుపక్కల భూగర్భ జలాలు ఇంకి పోయి రైతుల బోరు బావులు ఎండిపోయాయని వాపోయారు. ప్రకృతి వనరులను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న వారి పైన, దీనికి సహకరిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, సెబ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. సెబ్ అధికారులు అక్కడికి వచ్చారు. మొత్తం 9 ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న సెబ్ అధికారులు ఆరు ట్రాక్టర్లను రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించి, రెండు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. మరొకటి ట్రాక్టర్ డ్రైవర్ ట్రాలీని వదిలేసి ఇంజన్ తీసుకొని ఊడయించాడు. ఇసుక అక్రమ రవాణా ఘటనపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తున్నట్లు కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సమీవుల్లా, అంజాద్, జియా, అబూబకర్, కమల్ భాష, తుమకుంట పారిశ్రామిక వాద కార్మిక సంఘం నాయకులు బాబు, మూర్తి, జై భీమ్రావ్ భారత్ పార్టీ గణేష్, గంగాధర్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



పెన్నా నదిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

డిఆర్ఒ కొండయ్య

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి కొండయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ అధికారి రఘునాథరెడ్డి తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలలో మొదటి సంవత్సరం రాసే విద్యార్థులు 7501 మంది రెండవ సంవత్సరం 10461 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవకతవకులకు తావు లేకుండా ఫ్లయింగ్ స్క్వార్డులు పర్యవేక్షించాలన్నారు. 144 సెక్షన్‌ను పోలీసులు గట్టిగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు సకాలంలో బస్సులు నడపాలన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నీట మునిగిన పత్తి పంట

ప్రజాశక్తి - రొద్దం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుగ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని గౌరాజుపల్లికి చెందిన రాజప్పకు చెందిన రెండు ఎకరాల పత్తి పంట పూర్తిగా నీటమునిగింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి 15 రోజుల కింద సాగుచేసిన పత్తిపంట అంతా నీట మునిగిందని బాధిత రైతు వాపోయాడు.



నీటమునిగిన పత్తిపంట

ప్రజాశక్తి www.prajasakti.com

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు.!


తుపల్లి గ్రామ సమీపంలో ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు

నంబులపూలకుంట : మండల పరిధిలోని తుపల్లి గ్రామం వద్ద మలుపులు ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదంలో జరిగాయి. ఆయా ప్రమా దాల్లో చాలా మంది వికలాంగులు గా మారారు. కదిరి నుంచి మదనపల్లి, బెంగళూరు వెళ్లాలంటే ఇది సులభమైన మార్గం కావడంతో ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే లగేజ్ వాహనాలు, కొత్త వాహన దారులు రాత్రి వేళ ఈ మలుపును గురించకపోవడంతో ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే రోడ్డు రవాణా శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కానీ, రాత్రి సమయంలో రెడ్ లైట్స్ గాని ఏర్పాటు చేయకపోవడం తోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు కోరుతున్నా రోడ్డు రవాణా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి తుపల్లి వద్ద ఉన్న మలుపులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో కొనసాగిన పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రెండవ రోజైన మంగళవారం పోలీసుల విస్తృత తనిఖీలు కొనసాగాయి. ఉదయం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా కార్డెన్/సెర్చ్ చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ జిల్లాలో ఎక్కడా ఘర్షణలు, అల్లర్లు చోటు చేసుకోకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు కదిరి సబ్ డివిజన్‌లో డీఎస్పీ శ్రీలత పర్యవేక్షణలో అర్బన్ సిఐ పుల్లయ్య గాండ్లపెంట నంబులపూలకుంట, నల్లచెరువు, ధర్మవరం సబ్ డివిజన్‌లోని తాడిమర్రి, పుట్టపర్తి సబ్ డివిజన్‌లోని అమడగూరు, పెనుగొండ సబ్ డివిజన్‌లోని మడకశిర సర్కిల్ రొద్దం పరిధిలోని గ్రామాల్లో ఉదయం సిఐ, ఎస్ఐలు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత నేరస్తుల నివాసాల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. గ్రామసభ నిర్వహించి గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓట్ల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ జిల్లాలో 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా భద్రత పరంగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. పేకాట, మట్కా, మద్యం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మద్యం అమ్మేవారి సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ ప్రశాంత జీవనం గడపాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి-ముదిగుబ్బ


ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రభుత్వ స్థలాలు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ సరస్వతి హెచ్చరించారు. మండలంలోని సానేవారిపల్లి శివారులో 37 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం తహశీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి సర్వే చేయించారు. గ్రామస్తులు తెలిపిన సర్వేలోని భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించామని, ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నా, ప్రయత్నాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఆ భూమికి సమీపంలో ఆంజనేయస్వామి దేవస్థానం ఉందని, నిత్యం పూజలు జరుగుతుంటాయని భక్తులు పెద్దఎత్తున వస్తారని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కల్యాణ మండపం, వృద్ధాశ్రమం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం దేవాలయానికి భూమి కేటాయించాలని ఆలయ ట్రస్టు సభ్యులు వినతి పత్రం అందజేశారని, వారి వినతి మేరకు సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తహశీల్దార్ తెలిపారు.

జిల్లాలో 649.6 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా తనకల్లు మండలం మినహా అన్ని మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 32 మండలాలకు గానూ 31 మండలాల్లో వర్షం కురిసింది. మొత్తం 649.6 మి.మీ వర్షపాతం నమోదైంది. గత మూడు రోజులుగా పరిశీలిస్తే జిల్లాలో అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పొలాలను దుక్కి దున్ని చదును చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం కూడా రైతులకు సబ్సిడీతో విత్తన వేరుశనగ, ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతోంది. కాగా సోమవారం రాత్రి అత్యధికంగా హిందూపురంలో 52.8 మి.మీల వర్షపాతం నమోదైంది. అమలాపురం-41.6, గోరంట్ల-38.2, బత్తలపల్లి-37.6, కనగానిపల్లి-33.2, నల్లమాడ-31.2, సోమందేపల్లి-30.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలోల ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అమరాపురం, బత్తలపల్లి, కనగానిపల్లి, రొద్దం, లేపాక్షి మండలాల్లో గత మూడు రోజులుగా వర్షం కురిసింది.

లేపాక్షి పిహెచ్‌సి తనిఖీ


డిఎంహెచ్‌ఒ మంజువాణిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి : లేపాక్షి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి మంజువాణి సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో అన్ని జాతీయ కార్యక్రమాలు నిర్వహిండం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి లేపాక్షి ఆలయ ప్రెసిడెంట్ రామానంద భోజనం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకట చిరంజీవి, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


నూతన పైపులు ఏర్పాటు చేయిస్తున్న కమిషనర్ అంజయ్య

మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి బలిజ కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య సిబ్బందితో కలిసి ఆ కాలనీకి వెళ్లి పాత బోరు పైపులు తీయించి నూతనంగా పైపులు ఏర్పాటు చేయించారు. గత శనివారం కాలనీ వాసులు నెల రోజులుగా నీటి సమస్య తీవ్రమైందని పరిష్కరించాలని కమిషనర్‌కు విన్నవించుకున్నారు. దీంతో కమిషనర్ అంజయ్య స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. అలాగే సక్రమంగా నీరు వదలని వాటర్ మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా పనిచేయాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. గేట్ వాల్వ్ కూడా ఏర్పాటు చేసి బలిజ కాలనీకి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ మెన్‌ను ఆదేశించారు.


లేపాక్షిలో సోదాలు చేస్తున్న పోలీసులు

చోళసముద్రంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని చోళసముద్రం గ్రామంలో మంగళవారం ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని రూరల్ సిఐ ఈరన్న పర్యవేక్షించాడు. సిఐ మాట్లాడుతూ గ్రామంలో మద్యం అమ్మకాలు జరిపి గతంలో కేసులు నమోదైన వారు, రౌడీ షీటర్స్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎన్నికలు కౌంటింగ్ రోజు కానీ తరువాత రోజుల్లో కానీ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉంటూ గొడవలకు తావులేకుండా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

'పెనుకొండ శాసనాల్లో అగస్త్యుని సమాచారం'

చరిత్రకారుడు మైనాస్వామి విశ్లేషణ


సంస్కృత శాసనాన్ని చూపిస్తున్న మైనాస్వామి

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని అవిముక్తేశ్వరాలయంలో లభించిన సంస్కృత శాసనాలు అగస్త్య మహాముని ఉత్తర భారతావని నుంచి దక్షిణ దేశానికి చేసిన ప్రయాణం గురించి వివరిస్తున్నాయని చరిత్రకారుడు మైనాస్వామి వెల్లడించారు. అవిముక్తేశ్వర సన్నిధిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురాణ పురుషులు, రుషుల గురించి తెలియజెప్పే శాసనాలు అత్యంత అరుదుగా ఉంటాయన్నారు. రాజ్యాలు, రాజులు, పరిపాలన, దేవాలయాల నిర్మాణాలు, దానాలు, యుద్ధాలు, పన్నులు వంటి విషయాలు శాసనాల్లో అగుపిస్తాయన్నారు. అటువంటిది వేదకాలం నాటి అగస్త్యుని గురించి శాసనాల్లో ఉండడం చరిత్రకారులను ఆశ్చర్యపరిచే అంశమని తెలిపారు. అగస్త్యుడు వింధ్య పర్వత ప్రాంతంలో నివసించడం, అక్కడ నుంచి కాశీ క్షేత్రానికి వెళ్లడం, కాశి నుంచి బ్రహ్మపురం(నేటి పెనుకొండ) రావడం, ఘనగిరిపై వెలసిన బ్రహ్మ సరస్సు పక్కన తపస్సు చేయడం, మహాముని మలి అవతారంలో వామనేంద్రునిగా జన్మించడం, అగస్త్యుడు-వామనేంద్రుడుల స్మృత్యర్థం ఓ శివాలయం నిర్మించినట్టు, వారు శివారాధకులు అని శాసనాలు చెబుతున్నాయని మైనాస్వామి పేర్కొన్నారు.

శాసన కాలం : అగస్త్యుని గురించి తెలుపుతున్న సంస్కృత శాసనాలను శాలివాహన శక వర్షం 1327 పార్థివనామ సంవత్సరం ఫాల్గుణ మాసం ధవళ పక్షం దశమి భానువారం రోజున శాసనాన్ని రాశారు. (ఆంగ్ల తేదీ.. సామాన్య శకం 1405 ఫిబ్రవరి 10 ఆదివారం) సంస్కృత శాసనాలు అవిముక్తేశ్వర సన్నిధి రంగమండపం పై కప్పు స్తంభాలపై చెక్కి ఉండడాన్ని మైనాస్వామి చూపించారు. శాసనాలు నంది నాగరి లిపిలో ఉన్నాయని, అక్షరాలు ఎంతో అందంగా, పొందికగా ఉన్నాయని వివరించారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో హరిహరరాయల కొడుకైన మొదటి విరూపాక్ష రాయలు (1404-1405 సెప్టెంబర్) కాలంలో అవిముక్తేశ్వర ఆలయాన్ని పునర్నిర్మించారని మైనాస్వామి విశ్లేషించారు.

పెనుకొండలో వైసిపి జెండా ఎగురవేస్తాం

ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-పరిగి

ఇటీవల జరిగిన ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గంలో వైసిపి విజయం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ధీమా వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల వైసిపి నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆమె స్థానిక భీరలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి పంచాయతీలో తాను తిరిగానని ఓటర్ల మనోభావాలు గుర్తించానన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వారు పొందిన సంక్షేమ పథకాలు, మహిళలు పొందిన ఆర్థిక సాయంతో మరోమారు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతి మండలంలో మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం వైసిపి గెలుపునకు శుభ సూచకమన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం వల్ల కూటమికి అనుకూలమని అటు బిజెపి ఇటు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వెల్లడించడం హాస్యాస్పదమమన్నారు. ఈ ఎన్నికల్లో కూటమికి నిరాశ తప్పదని తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో మరోసారి వైసిపి జెండాను ఎగరవేస్తున్నామని, జరిగిన ఎన్నికలపై వైసిపి కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిచ, టిడిపి నాయకుల కుప్పిగంతులను పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పైడేటి ప్రభాకర్, జడ్పిటిసి శ్రీరాములు, డివి రమణ, శివశంకర్, మారుతిరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పరిగి ప్రభుత్వాసుపత్రి తనిఖీ


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని శాసనకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. జాతీయ ఆరోగ్య మిషన్ సత్యసాయి జిల్లా ఆరోగ్య కార్యక్రమాల మేనేజర్ పల్లా నాగరాజు, డేటా మేనేజర్ సుబ్బారావు ఆసుపత్రిని సందర్శించి గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు హిమోగ్లోబిన్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం కొందరు గర్భిణులు, బిడ్డ తల్లులకు, కౌమార బాలికలకు హిమోగ్లోబిన్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గతంలో నిర్వహించిన పరీక్షలతో బేరీజు చేసి హిమోగ్లోబిన్ విలువల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల మండలంలోని అన్ని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో నిర్వహించిన 'వయోజనుల బిసిజి టీకా' కార్యక్రమం కింద టీకా పొందిన వారిని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. సంబంధించిన ఆరోగ్య కేంద్ర సిబ్బంది అనురాధ, ఎంఎల్‌హెచ్‌పి సుమయా రికార్డులను పరిశీలించి మరింత ఉన్నతంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. అన్నిసేవల వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై ఓపి సేవలు, ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఆ బృందం వెంట వైద్యులు డా. స్వరూపరెడ్డి, డాక్టర్ నవీన, సామాజిక ఆరోగ్య అధికారి వన్నప్ప, పిహెచ్‌ఎన్ వెంకమ్మ, పర్యవేక్షకులు రవీంద్ర, పార్వతమ్మ ఉన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వడ్డెర్లు

ఘనంగా దుర్గాసుంకలమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన వడ్డెర కుల దైవం దుర్గాసుంకలమ్మ ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వడ్డెర్లు ఘనంగా నిర్వహించారు. ముందుగా వడ్డెర సామాజికవర్గం ప్రజలు పెద్దఎత్తున అమ్మవారికి జ్యోతుల దీపాలు మోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు సంగం అధ్యక్షులు రంగప్ప, ప్రసాద్, కౌన్సిలర్ దుర్గమంజుల, దుర్గ నవీన్, వెంకటేష్, నాగరాజు, అక్కులప్ప, సునీల్ కుమార్, దుర్గనాని, శివ, గోవింద, జయచంద్ర, మంజునాథ్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని విద్యానగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

23న సంగమేశ్వరుని రథోత్సవం

కొత్తచెరువు రూరల్ : కొత్త చెరువులో ని బుక్కపట్నం రోడ్డులో వెలసిన సంగమేశ్వర స్వామి రథోత్సవం ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మనో హర్, నటరాజు తెలిపారు. ఆలయం లో బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తామ న్నారు. గురువారం రథోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.


సొంత ఖర్చుతో జెసిబితో శుభ్రం చేయిస్తున్న స్థానికులు

ప్రజల చందాలతో మురుగు కాలువ శుభ్రం

ప్రజాశక్తి-హిందూపురం

రెండు రోజులుగా వర్షాలు కురవడంతో మురుగు కాలువలు పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ విషయం పై పరిగి రోడ్డు నుంచి నింకంపల్లి వెళ్లే రోడ్డులో నివాసం ఉంటున్న స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. దీంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారందరూ మంగళవారం చందాలు వేసుకుని జెసిబి ఏర్పాటు చేసి మురుగు కాలువలను శుభ్రం చేయించారు. స్థానికులు మాట్లాడుతూ సమస్యను సచివాలయ సిబ్బందితో పాటు మున్సిపల్ అధికారులకు వివరించినా స్పందించ లేదన్నారు. మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతుండడంతో భరించలేక తామే సొంతంగా జెసిబిని ఏర్పాటు చేసుకుని శుభ్రం చేయించామన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ



తలుపుల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దిలీప్ కుమార్ మండల ప్రజలకు సూచించారు. గ్రామాల్లో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తూ గొడవలు, విద్వేషాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

24న ఉచిత క్యాన్సర్ స్కానింగ్ క్యాంప్

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో మహిళలకు ఈ నెల 24వ తేదీ ఉచిత క్యాన్సర్ స్కానింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఎంఎస్ రామయ్య మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఆంకాలజీ విభాగం వారి సహకారంతో ఈ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

బత్తలపల్లి : ప్రభుత్వం రాయితీపై అందించే విత్తన వేరుశనగ కోసం రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ఓబిరెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మండలానికి విత్తన వేరుశనగ అందించిందన్నారు.

కొత్తచెరువు రూరల్ : ఖరీఫ్-2024కు సంబంధించి ప్రభుత్వం 40 శాతం రాయితీపై విత్తన వేరుశనగ పంపిణీ చేస్తోందని మండలంలోని రైతులు సంబంధిత ఆర్‌బికె పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ నటరాజు తెలిపారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మీనరసింహులు తెలిపారు.

పుట్టపర్తి : ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే సబ్సిడీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్లు బుక్కపట్నం మండలంలో ప్రారంభమయ్యాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సతీష్‌బాబు తెలిపారు. కె-6 రకం విత్తన వేరుశనగ కాయలు 40 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు



ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరెడ్డి, వంశీకృష్ణ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. హిందూపురం రూరల్ మండలంలోని బాలంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తూ పట్టణంలోని చిన్నమార్కెట్ వద్ద ఓ ప్రయివేట్ బస్సును ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అలాగే స్థానిక బెంగళూరు రోడ్డులోని రాజధాని ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ ప్రయివేటు డ్రైవింగ్ స్కూల్‌కి సంబంధించిన శిక్షణ కారు రోడ్డు పక్కన ఉన్న వంశీకృష్ణపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాల య్యాయి. వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

హత్యకేసు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన వాలంటీర్ అనిల్‌కుమార్‌యాదవ్(24) హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 19వ తేదీ స్నేహితులతో కలిసి కర్నాటకలోని పెసలపర్తి గ్రామం వెళ్లి అక్కడ మద్యం తాగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో కొత్త బయనపల్లి వద్ద కొత్తచెరువుకి చెందిన ఆరుగురు వ్యక్తులు అనిల్‌కుమార్‌యాదవ్‌తో ఘర్షణ పడ్డారు. వారు తీవ్రంగా కొట్టడంతో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హత్య కేసులో నిందితులైన కొత్తచెరువుకు చెందిన దూదేకుల సైపుల్లా, ముష్టూరు గొల్ల రఘునాథ్‌యాదవ్, గణేష్‌కుమార్, హేమంత్‌కుమార్, గొల్ల సాయినాథ్‌యాదవ్‌లను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

హిందూపురం : పట్టణంలోని రహమత్ పురం వద్ద మంగళవారం ఓ ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. విద్యుత్ శాఖ వారు కనీస భద్రత లేకుండా రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చుట్టుపక్కల విద్యుత్ సరఫరా అయింది. ఆ సమయంలో బాలబాపు రైతుకు చెందిన పాడి ఆవు మేత కోసం అక్కడికి వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో రూ. 50 వేల వరకూ నష్టం వచ్చిందని బాధిత రైతు వాపోయాడు. ఇకనైనా విద్యుత్ శాఖ వారు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా బెల్టు షాపులు.!

పట్టించుకోని పోలీసు, ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రమైన నంబులపూలకుంటలో బెల్టు షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. బెల్టు షాపుల్లో వేకువజామున 5 నుంచి ఉదయం 11 గంటల వరకూ, రాత్రి 9 నుంచి 12 గంటల వరకూ ఎంఆర్‌పి కంటే కంటే బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇదంతా తెలిసినా పోలీసులు కానీ ఎక్సైజ్ సిబ్బంది కాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ మద్యం షాపులకు వచ్చిన సరుకును వచ్చినట్లుగానే అక్రమంగా బెల్టు షాపులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా బాగా డిమాండ్ ఉన్న బ్రాండ్ల మద్యాన్ని ప్రభుత్వ దుకాణం సిబ్బంది బెల్టు షాపులకు విక్రయిస్తూ సొమ్ము చేసకుంటున్నట్లు సమాచారం. ఇకనైనా పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది స్పందించి మద్యం బెల్టు షాపులను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'శ్రీచైతన్య' విద్యాసంస్థలపై చర్యలేవీ..?

ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు చరణ్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాల అమ్మకాలపై విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు చరణ్ మండిపడ్డారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో పెద్దఎత్తున వసూళ్లు చేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదన్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లతో పాటు పాఠ్యపుస్తకాల అమ్మకాలను అడ్డుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బబ్లూ, ఉపేంద్ర, బాషా, నవీన్, వేణు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకుడిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవసాయ సహాయకుడిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రైతు శ్రీరాములు మాట్లాడుతూ మండల పరిధిలోని పి.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయకుడు పంచాయతీ పరిధిలో అనేక మంది రైతులు సకాలంలో పంటలు పండించిన ఈ క్రాప్ బుకింగ్ విషయంలో చాలా మంది రైతులకు తెలియపరచకపోవడం, పలుకుబడి నాయకులకు, అతనికి అనుకూలంగా ఉన్న వారికి ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేశారని ఆరోపించారు. దీంతో ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలో చాలామంది రైతుల పేర్లు లేకపోవడంతో రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడిని అడగ్గా ఎలాంటి జవాబు చెప్పడం లేదన్నారు. వ్యవసాయ సహాయకుడి వల్ల అనేక మంది రైతులు నష్టపోయారని, ఇలాంటి అధికారుల వల్ల భవిష్యత్తులో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘననివాళి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం డిసిసి అధ్యక్షులు కె.సుధాకర్ ఆధ్వర్యంలో దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఎన్నో ప్రజా సంక్షేమ సంస్కరణలు చేపట్టారని తెలిపారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మడకశిర మండల కన్వీనర్ మంజునాథ్, కాంగ్రెస్ రీసెర్చ్ కమిటీ జిల్లా అధ్యక్షులు తాళికెర రంగస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు